క్లుప్తంగా

బస్వాపురం రిజర్వాయర్‌కు నిధులు కేటాయించాలి

భువనగిరిరూరల్ : బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కోసం రూ.500కోట్ల నిధులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. ఆదివారం మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో సీపీఎం ఇంటింటి కార్యక్రమంలో భాగంగా ప్రజలను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బస్వాపురం రిజర్వాయర్‌కు నిధుల విడుదల చేయాలని కోరుతూ ఈనెల 20న జిల్లా కేంద్రంలోని రైతు బజార్ ఎదురుగా నిర్వహిస్తున్న ×సామూహిక నిరసన దీక్ష×లో రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యుడు కొండా అశోక్, గ్రామకార్యదర్శి కూకుట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

మోత్కూర్ : ప్రజా సమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం అన్నారు. మండలంలోని పాటిమట్ల గ్రామంలో ఆదివారం ఇంటింటికీ సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం పార్టీకి విరాళాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఇంటింటికీ సీపీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు రాచకొండ కనకయ్య, కురిమేటి యాదయ్య, దొండ నాగరాజు, మెతుకు అంజయ్య, బండి రవి, పిట్టల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను సకాలంలో పూర్తి చేయాలి



సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు నాయక్

ఆత్మకూరు(ఎం) : గ్రామాల్లో చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. ఆదివారం మండలంలో ఎన్యూమరేటర్లు చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన వెంట సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, ఎన్యుమరేటరుల తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ విప్‌కు సన్మానం



సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భువనగిరిటౌన్ : జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియామకమైన మహ్మద్ అవైస్‌చిస్తీ ఆదివారం ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, డీసీసీ కార్యదర్శి మహ్మద్ మజహార్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూరు(ఎం) : మండలంలోని కప్రాయపల్లిలో గ్రామానికి చెందిన నిరుపేద చేనేత కార్మికుడు పరిమెల్ల నర్సయ్య కూతురు పరిమెల్ల రోహిణి వివాహం ఆదివారం జరిగింది. వివాహ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ సహకారంతో రూ.5వేలు నర్సయ్యకు ఆర్థికసాయంగా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కాంబోజు భాను, బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ దేవరపల్లి ప్రవీణ్‌రెడ్డి, నాయకులు కొంగరి మైసయ్య, గాదెగాని ముత్యం, నూనెముంతల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రాచకొండ యాదయ్య శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. కాగా యాదయ్య డ్రైవర్ కావడంతో యజమాని దేవులపల్లి నరేందర్‌రెడ్డి పంపిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని తోటి డ్రైవర్లు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి అందజేశారు. కార్యక్రమంలో పారంద రమేష్, దేవరాం, వేనేపల్లి శ్రీపతిరావు, పల్లె వెంకటయ్య, పోలెపల్లి శ్రీరాములు, ప్రభుదాస్, బాలకృష్ణ, రవీందర్ తదితరులు ఉన్నారు.

భిక్షపతికి సన్మానం

భువనగిరి రూరల్ : మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన బింగి భిక్షపతి పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం గ్రామంలో పద్మశాలి గ్రామ అధ్యక్షుడు గుర్రం పుల్లయ్య ఆధ్వర్యంలో భిక్షపతిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుర్రం పుల్లయ్య, మంగళపల్లి బాలయ్య, చింతకింది ఆంజనేయులు, మునునూరి చంద్రయ్య, డాక్టర్ కస్తూరి వెంకన్న, గుర్రం తిరుమలేష్, గుర్రం నాగరాజు, గుర్రం శ్రీనివాస్, చిన్న, గుర్రం సురేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలపై నిర్లక్ష్యం

- అసంపూర్తిగా ఐదు ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణాలు
- పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వేడుకోలు



చొల్లేరు గ్రామంలో స్లాబ్‌కే పరిమితమైన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనం



పిల్లర్ల దశలో నిలిచిన మల్లాపురం ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు

యాదగిరిగుట్ట రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందించేందుకు గత ప్రభుత్వం మండలంలోని ఐదు ఆరోగ్య ఉపకేంద్రాలకు నూతన భవనాల కోసం నిధులు మంజూరు చేసింది. అయితే నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతుండడంతో నేటికీ ఆరోగ్య ఉపకేంద్రాల భవన నిర్మాణ పనులు పూర్తికాలేదు. యాదగిరిగుట్ట మండలంలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 9 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలున్నాయి. ఇందులో ఐదు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలకు నూతన భవనాలు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.20లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో చొల్లేరు, చిన్నకందుకూరు గ్రామాల్లో స్లాబ్ దశలో భవన నిర్మాణ పనులు నిలిచిపోగా మాసాయిపేటలో బేస్‌మెంట్ పనులను మాత్రమే పూర్తి చేశారు. మల్లాపురం, గౌరాయపల్లిలో భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేసి వదిలేశారు. సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతోనే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేసి ఆరోగ్య ఉప కేంద్ర భవనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని పలువురు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



"మండలంలోని మల్లాపురం గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణ పనులకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశాం. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం భవన నిర్మాణాలను పట్టించుకోవడం లేదు. అసంపూర్తిగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నాం.

– కర్రె వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు

పనులు పూర్తి చేయాలి



"నిలిచిపోయిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతోనే కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. ప్రస్తుతం ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్ర భవనాల్లో సరైన వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవన నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– తోటకూరి బీరయ్య , మాజీ సర్పంచ్, చొల్లేరు

గోదావరి నీళ్లతో అన్ని చెరువులు నింపుతాం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



సైదాపురం చెరువు అలుగు వద్ద పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్: గోదావరి నీళ్లతో నియోజకవర్గంలోని అన్ని చెరువులు నింపుతామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. మండలంలోని సైదాపురం గ్రామంలో గోదావరి నీళ్లతో నిండి అలుగు పోస్తున్న చెరువును ఆదివారం ఆయన సందర్శించారు. చెరువు అలుగు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. చెరువులో పూలు చల్లి, పసుపు, కుంకుమ వేసి, హారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు కరువు నేలపై న గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతున్నాయన్నారు. గత పాలకులు ఆలేరు ప్రాంతంలోని రైతులను పట్టించుకోలేదన్నారు. బస్వాపురం ప్రాజెక్టును నిర్మించిన ఆలేరుకు చుక్క నీళ్లు అందించకుండా పనులు సాగించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మల్లన్న సాగర్ నుంచి వచ్చే ఓటీ కెనాల్ ద్వారా గోదావరి నీళ్లతో ప్రతి చెరువును నింపుతున్నామన్నారు. నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు పైగా సాగు నీరందించడమే ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, మండల పార్టీ అధ్యక్షులు కానుగు బాలరాజ్, బీర్ల శంకర్, దుంబాల వెంకట్‌రెడ్డి, శిఖ ఉపేందర్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏబీవీపీ నల్లగొండ విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్‌గా మధు



నారి మధు

భూదాన్‌పోచంపల్లి : మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లి గ్రామానికి చెందిన నారి మధు ఏబీవీపీ నల్లగొండ విభాగ్ సోషల్ మీడియా కన్వీనర్‌గా ఎన్నికయ్యారు. నల్లగొండ పట్టణంలో ఈనెల 15, 16తేదీల్లో నిర్వహించిన ఏబీవీపీ ఉమ్మడి జిల్లా అభ్యాస వర్గ సమావేశంలో సోషల్‌మీడియా కన్వీనర్‌గా మధును నియమిస్తూ జిల్లా ప్రముఖ్ నగేశ్ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ



మహాలింగార్చన పూజలో పాల్గొన్న పండితులు



పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

భువనగిరి : పట్టణంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల పడి పూజ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయాస్తమాన పూజలను ప్రారంభించారు. ఉపాసకులు శివకిరణ్ శర్మ, ఆలయ నిత్య అర్చకులు నరేంద్ర శర్మ ఆధ్వర్యంలో గణ పతి హోమం, మహాలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయితరాములు,అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ మంచాల ప్రభాకర్,ప్రధాన కార్యదర్శి దిడ్డి సత్యం,కోశాధికారి ఘటాని, ఆర్గనైజింగ్ సెక్రటరీ చీకటిమల్ల రాములు, ఉపాధ్యక్షుడు అయితే శ్రీనివాస్, చింత రవి, సభ్యులు సోమన్న, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర : ఎమ్మెల్యే



కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు

అడ్డగూడూరు : రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చౌల్లరామారం గ్రామంలోని ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పలువురు రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు తేమ శాతం ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్ ఇందుర్తి వెంకటరెడ్డి, అశోక్ రెడ్డి, కడియం పరమేష్, శేఖర్ రెడ్డి ,ప్రవీణ్, ఏపీఓ వెంకటేశ్వర్లు, ఏఓ పాండురంగాచారి, ఏఈఓ అక్షర, వీవీఏ తోట సుజాత, రమ, రైతులు లింగమల్లు, బాబు, వెంకన్న పలువురు నాయకల తదితరులు పాల్గొన్నారు.


పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



డబుల్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు : పట్టణంలో చేపడుతున్న సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. చండూరు మున్సిపల్ పరిధిలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వర్షపు నీరు, డ్రెయినేజీ నీరు సజావుగా వెళ్లేలా నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీకి సంబంధించి మాస్టర్‌ప్లాన్ తయారు చేయించి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. అనంతరం మున్సిపల్ కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించారు. అదేవిధంగా మండల పరిధిలోని చొప్పరివారిగూడెంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. చామలపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు కొరిమి ఓంకారం, కోడి శ్రీనివాస్, నల్లగంటి మల్లేశం, కొన్‌రెడ్డి యాదయ్య, అనంత చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


శివలింగాన్ని తాకిన సూర్య కిరణాలు



రామన్నపేట : మండలకేంద్రంలోని శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలోని శివలింగాన్ని ఆదివారం సూర్య కిరణాలు తాకాయి. ఉదయం పూజలు చేసిన అనంతరం శివ లింగానికి సూర్యకిరణాలు తాకడంతో భక్తులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. శివలింగానికి సూర్యకిరణాలు తాకాయని తెలియడంతో భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

రామన్నపేట : మండలంలోని కక్కిరేణి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం జిల్లాకమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం కక్కిరేణి గ్రామంలో ఇంటింటికీ సీపీఎం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు వేముల సైదులు, గొరిగె సోములు, కార్యదర్శి కన్నెబోయిన యాదయ్య, కృష్ణ, నరేందర్, నరసింహ పాల్గొన్నారు.



ఇంటింటికీ సీపీఎం కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

భువనగిరి బస్టాండ్ కిటకిట



భువనగిరి బస్టాండ్‌లో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

భువనగిరి : ప్రయాణికుల రద్దీతో భువనగిరి ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. ఆదివారం సెలవు దినం కావడంతో యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి, స్వర్ణగిరి ఆలయానికి వచ్చే భక్తులతో పాటు వివాహాలు, గ్రూప్ –3కి పరీక్ష ఉండడంతో ప్రయాణికులతో బస్టాండ్ కిక్కిరిసిపోయింది. రద్దీకి అనుగుణంగా బస్సులను నడపకపోవడంతో బస్సుల కోసం వందలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రాత్రి పొద్దుపోయే వరకు బస్టాండ్‌లో రద్దీ కన్పించింది.

రోడ్డును తవ్వారు.. మరమ్మతులు మరిచారు

- మరమ్మతుల్లో భాగంగా నెల రోజుల క్రితం తవ్విన చెరువుకట్ట రోడ్డు
- నేటికీ పూడ్చకపోవడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



తవ్వి మరమ్మతులు చేపట్టకుండా వదిలేసిన రోడ్డు

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని పెద్ద చెరువు మినీ ట్యాంకు బండ్ మరమ్మతులలో భాగంగా ఇటీవల చెరువు కట్ట రోడ్డును తవ్వారు. కానీ మరమ్మతులు చేయకుండా వదిలేశారు. సూర్యాపేట, ఖమ్మం, తొర్రూరు, మహబూబాబాద్ జిల్లాలకు ప్రధాన రహదారి కావడంతో ఈ మార్గంలో వందలాది ఆర్టీసీ బస్సులు, వేలాది ప్రైవేట్, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డును తవ్వి మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌గా ప్రకటించి రూ.4.21 కోట్ల వ్యయంతో వివిధ రకాల పనులు చేపట్టింది. ఇందులో భాగంగా చేపట్టిన చెరువు కట్ట రోడ్డు, సీసీ, బీటీ రోడ్డు పనుల్లో నాణ్యత లోపించింది. దీంతో కొంత మేర రోడ్డు పగుళ్లు పట్టి చెరువు కట్ట రోడ్డు కుంగింది. దీనిపై అప్పట్లో సాక్షి దినపత్రికల్లో పలు కథనాలు వచ్చాయి. దీంతో మరమ్మతుల కోసం మరో రూ.3.60 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. పనుల టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ చెరువు కట్ట రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభించారు. కుంగిన రోడ్డును 25 మీటర్లు పొడువు తవ్వించారు. రోడ్డు తవ్వి నెల రోజులు గడుస్తున్న మరమ్మతుల పనులు చేపట్టడం లేదు. కంకర, వెట్‌మిక్స్ వేసి రోలింగ్ చేయించి బీటీ వేయాల్సి ఉంది. అయితే తవ్విన రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన భారీకేడ్లు సైతం ఇటీవల కన్పించడం లేదు. దీంతో రాత్రివేళ్లలో తవ్విన రోడ్డు గుర్తించలేక ప్రమాదాల బారీన పడుతున్నారు. తక్షణమే రోడ్డు మరమ్మతుల పనులు చేపట్టి పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

మరమ్మతు పనులు పూర్తి చేయాలి



"రోడ్డు మరమ్మతుల్లో భాగంగా నెల రోజుల క్రితం రోడ్డును తవ్వి వదిలేశారు. తవ్విన రోడ్డు కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నాం.

– సజ్జనం మనోహర్, బీజేపీ పట్టణ కార్యదర్శి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

"మరమ్మతుల్లో భాగంగా రోడ్డు తవ్వింది వాస్తవమే. కంకర వేసి తొక్కించి బీటీ వేయాల్సి ఉంది. అర్ధాంతరంగా రోడ్డు మరమ్మతులు కాంట్రాక్టర్ ఆపేశారు. కాంట్రాక్టర్ తీరుపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

– చంద్రశేఖర్, ఏఈ, ఐబీశాఖ

కాగా నిలిచిన మరమ్మతు పనులపై కాంట్రాక్టర్ వీరస్వామిని సంప్రదించగా డాంబర్ కొరతతో మరమ్మతుల పనులు నిలిపి వేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలను పీడిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునిత



మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం): ప్రజా పాలనంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పీడిస్తోందని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల లగచర్లలో రైతుల మీద జరిగిన దాడి పరోక్షంగా సీఎం రేవంత్‌రెడ్డి చేయించినట్లుగా బావించాల్సి వస్తుందన్నారు. రైతులు తమ భూములను ఇవ్వమని చెప్పడానికొస్తే కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసులు దాడులకు పాల్పడ్డారన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి పాలన రజాకార్ల పాలను తలపిస్తుందని విమర్శించారు. రజాకార్ల విముక్తి కోసం పోరాడిన చాకలి ఐలమ్మ, కొమురంభీమ్ వారసత్వాన్ని కొనసా గించాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను వాడుకుంటుందని పోలీసులు కూడా చట్టానికి వ్యతిరేకంగా పని చేస్తే ఉద్యోగాలను పోగొట్టుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కోరె భిక్షపతి, సోలిపురం అరుణ, బీరప్ప పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలుచేయాలి



మాట్లాడుతున్న రాంబాబు

మునుగోడు: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దివ్యాంగుల సంక్షేమానికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మునుగోడులో నిర్వహించిన మునుగోడు నియోజకవర్గ దివ్యాంగుల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు నెలకు రూ.6వేల పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 11 నెలలు గడిచినా హామీ అమలు చేయకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఈ నెల 18 నుంచి 23 వరకు అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. అదేవిధంగా ఈ నెల 25న చలో హైదరాబాద్ చేపట్టి ఇందిరా పార్క్ వద్ద వికలాంగుల ఆవేదన సభ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీనివాసులు, జిల్లా కన్వీనర్ హరికుమార్, కో కన్వీనర్లు వీరబోయిన సైదులు, చిలుముల జలంధర్, దొంతగోని మహేష్, దొమ్మాటి సత్యనారాయణ, యసరాని మంగమ్మ, శివరాత్రి సైదమ్మ, ఈద పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మోత్కూర్ : పట్టణానికి చెందిన పోల్కం శేషయ్యకి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 37,500 చెక్కును ఆదివారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు పైళ్ల సోమిరెడ్డి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కో అప్షన్ మెంబర్ గణగాని నర్సయ్య, కారుపోతుల వెంకన్న, నాయకులు జినుకల కనకయ్య, బద్దం నాగార్జున్ రెడ్డి, మాజీ సర్పంచ్ సుదగాని పాండు, సమీర్, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు మెంట నగేష్, కొనతం నరేందర్ రెడ్డి, బీసు రాహుల్, నరేష్, అశోక్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి మున్సిపల్ పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, కమిషనర్ రామంజులరెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు వెంకటేశం పాల్గొన్నారు.



మున్సిపల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి

డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డికి పితృ వియోగం

గుండాల : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డికి పితృ వియోగం కలిగింది. ఆదివారం ఆయన తండ్రి అండెం కొండల్‌రెడ్డి అనారోగ్యంతో హైదారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందాడు. ఆయన మృతికి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి, పలువురు నాయకులు సంతాపం తెలిపారు. సోమవారం ఉదయం మండలంలోని నూనెగూడెంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశం



కటుకం వెంకటేశం

రాజాపేట : మండలంలోని రఘునాథపురం గ్రామానికి చెందిన కటుకం వెంకటేశం పద్మశాలి సంఘం చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు కల్లకాటి రాజ్‌కుమార్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడారు. చేనేత పరిశ్రమ అభివృద్ధి కోసం కృషిచేస్తానని, నేతన్నల హక్కులకు పాటుపడతానని అన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

భువనగిరి రూరల్ : మండలంలోని జమ్మాపురం గ్రామంలో శ్రీ ఆర్కే ఆస్పత్రి, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయించిన జోజప్పని పలువురు అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు నీలం పద్మ, మాజీ సర్పంచ్ పసల జ్యోతి, ఆరోగ్యయ్య, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు సుధాకర్, ప్రసన్న, లూర్దయ, స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు



కంకరతేలిన జనంపల్లి- ఉత్తటూరు రోడ్డు



గుంతలమయంగా మారిన సిరిపురం- వెలిమినేడు రోడ్డు

రామన్నపేట : మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు కంకరతేలి గుంతలమయంగా మారి అధ్వానంగా తయారయ్యాయి. కొన్ని ప్రాంతాల్లోని రోడ్లు వర్షపు నీటితో చిన్న కుంటలను తలపిస్తుండడంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంత రోడ్లపై ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.